నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, ఫిబ్రవరి 10 : ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు నిజాంపేట్ ఏఈ తెలిపారు. 11 కే వీ నిజాంపేట్ ఫీడర్ పరిధిలోని బాలాజీ వెస్ట్ కౌంటీ, శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, బాలాజీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ పేజ్ -3 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమతో సహకరించాలని కోరారు.

కేపీహెచ్‌బీ కాలనీ : వసంత నగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి తెలిపారు. నేడు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్, కే పీహెచ్ బీ కాలనీ -6 పేజ్, సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్‌నగర్ పేజ్ 1, 2, వసంత నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మాదాపూర్, ఫిబ్రవరి 10 : వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌కు అత్యవసర పరిస్థితుల్లో అంతరాయం కలుగకుండా ట్రాన్స్ కో అధికారులు నూతన ఫీడర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం పనులను ప్రారంభించడంతో పలు ఫీడర్లకు సంబంధించిన ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. 11 కె.వి. మార్తాండ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11 కె.వి. ప్రేమనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు మార్తాండ నగర్ అంతట, ప్రేమనగర్ , ప్రేమ నగర్ బీ - బ్లాక్, న్యూ హఫీజ్ పేట్ ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం కలగగా, 11 కె.వి. హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ఓల్డ్ హఫీజ్ పేట్, సాయి నగర్, యూత్ కాలనీ, వార్డ్ ఆఫీస్ ఏరియా, గ్రీన్ బావార్చి ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు, 11 కె.వి. ఆదిత్య నగర్ ఫీడర్ పరిధిలోని ఆదిత్య నగర్, ఎస్ .సి. బి. కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనట్లు చందానగర్ ఎలక్ట్రికల్ ఏఈ దీప్తి తెలిపారు.



కేటీఆర్ ధర్నాకు మద్దతు.. తరలిన బీఆర్ఎస్ నాయకులు

మియాపూర్, ఫిబ్రవరి 10 :రాష్ట్ర ప్రభుత్వం రైతుల విషయంలో నిరంకుశ ధోరణి అవలంబిస్తుందని, రైతు సమస్యలపై కేటీఆర్ కొడంగల్‌లో చేపట్టిన రైతు ధర్నాకు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఈ మేరకు సోమవారం గచ్చిబౌలిలోని కేటీఆర్ నివాసం వద్ద సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కొంపల్లిలో యూజీడీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఛాంద్ర విలాస్, సిల్వర్ లీఫ్, అపర్ణ పాల్మ్ గ్రోవ్స్, రాయల్ పార్క్-2, వడ్డేర బస్తీ ప్రాంతాల్లో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (UGD) పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో మౌలిక సదుపాయాల ప్రాధాన్యత ఉంటుందని, ప్రజలకు మెరుగైన పారిశుధ్య నీటి పారుదల సౌకర్యాలను అందించడానికి ఈ UGD ప్రాజెక్టు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రజలకు అధునాతన వసతులు అందించేందుకు తాను అన్నివిధాల కృషి చేస్తున్నానని అన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే గారు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవేందర్ యాదవ్, రవీందర్ యాదవ్, వినోద్, ప్రవీణ్ రావు, డప్పు కిరణ్, లక్ష్మణ్, సంగీత రెడ్డి, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని శ్మశాన వాటికల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను కోరారు. సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, హార్టికల్చర్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని మతాల శశానవాటికలను పరిశీలించామని.. సమస్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు శ్మశాన వాటికల లో 60 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు పూర్తి కాలేదన్నారు. పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత పనులకు నిధులు తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, సబీహా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, శ్రవణ్ కుమార్, జీహెచ్ఎంసీ ఎస్ ఈ చిన్నా రెడ్డి, ఈ ఈ లు గోవర్ధన్ శ్రీనివాస్, డి ఈ లు, ఏఈలు, హార్టికల్చర్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

మియాపూర్ ఫిబ్రవరి 10: భూమి, ఇండ్లు, ఇండ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం ప్రజలను మోసగిస్తున్నదిని ఎం సీపీ ఐ యూ రాష్ట్ర నాయకుడు వనం సుధాకర్ ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ పబ్బం గడుపుకుంటున్నదన్నారు. ఎం సీపీఐయూ నాయకుడు తాండ్ర కుమార్ మూడో వర్ధంతి నేపథ్యంలో ఈనెల 14 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన సోమవారం మియాపూర్‌లో ఆవిష్కరించారు. ఈనెల 14 న టేకు నరసింహ నగర్‌లో తాండ్ర కుమార్ విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్లు సుధాకర్ పేర్కొన్నారు. పేదల అవసరాలను ఆసరాగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నదని సుధాకర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పరిపాలన కొనసాగిస్తున్నదని ప్రభుత్వాలపై తాండ్ర కుమార్ స్ఫూర్తిగా పోరాటాలను కొనసాగించి హక్కులను సాధించుకోవాలని సుధాకర్ పిలుపునిచ్చారు . కార్యక్రమంలో అనిల్ కుమార్ , కళావతి , దానయ్య , దశరథ నాయక్, మురళి, తుకారం భాగ్యమ్మ పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట : అసెంబ్లీ విప్ గా నియమితులైన ఎమ్మెల్యే వివేకానంద్‌కు రంగారెడ్డి నగర్ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో కుత్బుల్లాపూర్‌నకు ప్రాధాన్యత పెరుగడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో డివిజన్, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

ఆక్రమణల తొలగింపు

దుండిగల్, ఫిబ్రవరి 10: ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తే ఉపేక్షించబోమని బాచుపల్లి మండలం తాసీల్దార్ పూల్ సింగ్ హెచ్చరించారు. నిజాంపేట్ సర్వేనం. 233/21, శివాలయం పక్కన ఉన్న 1134 గజాల ప్రభుత్వ భూమిని క్లైమ్ చేస్తూ కొందరు ఆదివారం ఆక్రమించేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్న విషయంతెలిసిందే. ఈ క్రమంలో సోమవారం తాసీల్దార్ పూల్ సింగ్ స్వయంగా ఆక్రమణకు గురవుతున్న 233/11 ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీ బేస్మెంట్లను తొలగింపజేశారు. సదరు స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని ఆర్ఐకి సూచించారు. బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ సమీపంలోని సర్వేనం. 295 ప్రభుత్వ భూమిలో నిర్మించిన రెండు గదులను సైతం కూల్చివేశారు. మళ్లీ నిర్మాణాలు చేపడితే కబ్జాదారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుచిత్ర బస్‌స్టాప్ వెనకాల ఓ బహుళ కమర్షియల్ అంతస్తు నిర్మాణం గ్రీన్‌జోన్‌లో వెలిసిన అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

సుచిత్ర చౌరస్తా గ్రీన్ జోన్ లో అక్రమ షెడ్డు కూల్చివేత

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10: జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్ర సర్కిల్ బస్ స్టాప్ వెనకాల ఓ బహుళ అంతస్తుల కమర్షియల్ భవనానికి సంబంధించిన గ్రీన్ జోన్ లో వెలసిన అక్రమ షెడ్డు నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఇలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఉన్న నిబంధనలను పక్కనపెట్టి నిర్వాహకులు చేపడుతున్న అక్రమ వ్యాపార షెడ్డు నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదు మేరకు షెడ్డును తాత్కాలికంగా కూల్చివేశారు. కాగా ఓపెన్ గ్రీన్ జోన్ తిరిగి యథాస్థితి కి తేవలసి ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారులు తాత్కాలికంగా కూల్చి వేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్న తాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

జగద్గిరిలో గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 10: జగద్గిరిగుట్ట సమీపం .. పాపి రెడ్డి నగర్ లో గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. పోలీసులు స్థానికులు చెప్పిన వివరాల మేరకు పాపి రెడ్డి నగర్ రోడ్డు నం. 12లోని ఓ ఇంటిలో సోమవారం వంట చేసే సమయంలో గ్యాస్ లీక్ అయింది. మంటలు అంటుకోవడంతో సువర్ణకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులసాయంతో అంబులెన్స్ లో బాధితురాలిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. సమాచార అందుకున్న పోలీసులు టనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు సేకరించారు.

రేషన్‌బియ్యం పట్టివేత

ఉప్పల్, ఫిబ్రవరి 10 : రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఉప్పల్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. సోమవారం ఉదయం ఐడీఏ ఉప్పల్‌లోని జెర్సీ కంపెనీ ఎదురుగా గల పార్కింగ్‌ప్లేస్‌లో లారీని నిలిపి ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజస్థాన్‌కు అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం ఉన్న లారీని ఉప్పల్ పోలీసులు తనిఖీ చేశారు. లారీలో అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం గుర్తించారు. లారీని స్వాధీన చేసుకొని అందులోని 19 టన్నుల బియ్యం పట్టుకున్నారు. డ్రైవర్ మహ్మ ద్ అష్జల్, సహాయకుడు జంగయ్యను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

కీసర :నాగారం మున్సిపల్ పరిధిలోని భోగారంలోని మున్సిపల్ సిబ్బందికి సోమవారం బట్టలు, నూనె, సబ్బులను కమిషనర్ భాస్కర్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి ప్రతి నెల ప్రభుత్వం నుంచి వచ్చే సరకులను సక్రమంగా అందిస్తామని తెలిపారు. వారివారి ప్రాంతాల్లో విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భోగారం వార్డు కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' వినతులపై తక్షణచర్యలు

మియాపూర్ లో..

కూకట్‌పల్లి జోనల్ ఆఫీస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జడ్సీ సి.అపూర్వ చౌహాన్

మియాపూర్, ఫిబ్రవరి 10 : చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పలు శాఖల అధికారులతో కలిసి సమస్యలపై వినతులను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం నుంచి మూడు, ఇంజినీరింగ్ సం బంధించిన మూడు వినతులను ప్రజలు సమర్పించారు. ఉపకమిషనర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించిన వినతులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు . అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్షే త్రస్థాయిలో సమస్యలపై పర్యటించి, పరిష్కా ర చర్యలు చేపట్టి తిరిగి ప్రజలకు సమాచారం అందించాలని మోహన్ రెడ్డి ఆదేశించారు.

కూకట్‌పల్లిలో 18 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 18 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 9 , ఇంజినీరింగ్ విభాగానికి 6 , రెవెన్యూ విభాగానికి 1, ఎలక్ట్రికల్ విభాగానికి 1, వెటర్నరీ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అలాగే మూసాపేట్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి లో 7 ఫిర్యాదులు రాగా.. టౌన్ ప్లానింగ్ విభాగానికి 5, శానిటేషన్ విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి 1 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్లో నిర్వహించిన ప్రజావాణిలో 3 ఫిర్యాదులు రాగా.. టౌన్ ప్లానింగ్2, రెవెన్యూ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు డీసీ గంగాధర్ తెలిపారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని, అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివిధ పార్టీల నాయకుల ఫిర్యాదు..

దుండిగల్, ఫిబ్రవరి 10: కాగా సర్వేనం. 233/11 లోని ప్రభుత్వ భూమిని కాజేసేందుకు యత్నిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని నిజాంపేట కార్పొరేషన్ చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్‌కు ర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ కోలన్ నీలారెడ్డి, ఆకుల సతీశ్, పాలూరు మాజీ కార్పొరేటర్ ఉన్నారు.

కారు బీభత్సం

మాదాపూర్, ఫిబ్రవరి 10: కారు డివైడర్ ను ఢీ కొనడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాహుల్ కుమార్ మరో ఇద్దరితో ఉదయం 4:30 నుంచి 5 గంటల మధ్య స్నేహితులతో కలిసి సైబర్ టవర్ నుంచి మాదాపూర్ పీఎస్ వైపు స్కోడా (ఏపీ 28 సిజే 1214) కారులో వస్తుండగా పిల్లర్ నం. 1732 వద్ద వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీ కొట్టడంతో కారు పల్టీ కొట్టింది. ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో రాహుల్ కుమార్ స్నేహితులు ఇద్దరు కారులో నుంచి ఆటో ఎక్కి వెళ్లిపోయారు. కారు నడిపిన రాహుల్ కుమార్ స్థానికులతో కారును ఉదయం వచ్చి తీసుకు వెళ్తానని చెప్పి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారును పీఎస్‌కు తరలించారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ - రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 18, కాకర 35, బీర 35, క్యాబేజీ 9, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 35, చిక్కుడు 28, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 20, క్యాప్సికం 35, ఆలుగడ్డ 23, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 29, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 25, గుమ్మడి 15, నిమ్మకాయలు(12) 20 నుంచి 30, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చి బఠానీ 28, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 80, వెల్లుల్లి 200, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9 :30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వాసవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 10 : బాలాజీ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్పా ల్గొని పూజలు చేశారు. వారు మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, కాలనీ అధ్యక్షుడు వెంకటరావు, నాగరాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ సీయూ లో నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ- 2020 సదస్సు

సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, వీసీ ప్రొఫెసర్ బి.జె. రావు

కొండాపూర్, ఫిబ్రవరి 10 : నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ - 2020 దేశ భవిష్యత్‌కు చారిత్రాత్మక నిర్ణయమని, ప్రతి చిన్నారి సాధికారతకు రోడ్ మ్యాప్ ల పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. గచ్చిబౌలి లోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన ట్రెండ్స్ అండ్ ఇన్నోవేట్స్ ఎన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ పోస్ట్ ఎంఈపీ - 2020 జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ మాట్లాడుతూ.. యువతను ఉత్తేజపరచడంలో విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సంప్రదాయ భారతీయ విద్యా విధానంపై మాట్లాడుతూ .. ఇది గురు-సిస్య పరంపర (ఉపాధ్యాయ-విద్యార్థి సంబంధం) ను నొక్కి చెప్పారు.

ఎన్ఈపీ దేశ భవిష్యత్తుకు చారిత్రాత్మక అడుగు అని, ప్రతి చిన్నారి సాధికారతకు రోడ్ మ్యాప్ లాంటిదని ఆయన అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వాడుకోవాల్సిన అవసరాన్ని ఎత్తిచూపిన ఆయన, దాన్ని మంచి, చెడు రెండింటికీ ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. మానవాళి ప్రయోజనం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో విద్య మనకు నేర్పుతుందని, ఇది అసాధారణ అభ్యాస స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందన్నారు. సదస్సు చర్చలు కొత్త దారులు తెరవాలని, టీఏకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. రెండు రోజులపాటు సాగే సదస్సులో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బిజె రావు పాల్గొన్నారు.